
ప్రజాశక్తి
సోమవారం 8 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం



అదనంగా ధాన్యం తీసుకుంటే క్రిమినల్ చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో ఎక్కడైనా రైతుల నుండి అదనంగా ధాన్యం తీసుకుంటే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు ఒక్క గింజ ధాన్యం కూడా అదనంగా మిల్లర్లకు ఇవ్వకూదని కోరారు. రైతులను దోపిడీ చేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఒక్క గింజ అదనంగా ఇవ్వొద్దని, ఎవరైనా అడిగితే వెంటనే ధాన్యం కొనుగోలు జిల్లా కంట్రోల్ రూమ్ నెంబరు 08963-293037, 7702003582, జిల్లా కలెక్టర్ సిసి ఫోన్ నంబరు - 8333813243 కు సమాచారం అందించాలని ప్రకటనలో కోరారు.

ఉపాధికి ఆధార్ తిప్పలు



ఆందోళనలో కూలీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీల వేతనాల చెల్లింపునకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్ అమలు చేస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచీ ఈ విధానం అమల్లోకి వచ్చింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో.. అంటూ కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం జిల్లాలో 3.51 లక్షల మందికి ఉపాధి జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1.61 కోట్ల పనిదినాలు కల్పించినట్టు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఈ లెక్కన పనిదినాలు 107.27 శాతంగా నమోదయ్యాయి. అటు పార్వతీపురం మన్యం జిల్లాలో 2.07 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 3.95 లక్షల మంది పనులు చేస్తున్నారు. రోజువారీగా పనులకు హాజరౌతున్న వారి సంఖ్య 1.91లక్షల వరకు ఉంది. ఇరు జిల్లాల్లోనూ ఏటా వందల కోట్ల రూపాయలు ఉపాధి కూలీలకు జమ అవుతున్నాయి. దీంతో ప్రకృతి వైపరీత్యాలు, లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనా ఉపాధి కూలి డబ్బులతో బతుకీడుస్తున్నారు. దీన్నిబట్టి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉపాధి హామీ పనుల అవసరం, ఆవశ్యకత ఎంత ఉందో వేరేగా చెప్పనక్కర్లేదు. తాజాగా జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్న నిబంధన తప్పనిసరి చేయడంతో ఎలాంటి చిక్కులు వస్తాయో అన్న ఆందోళన కూలీల నుంచి వినిపిస్తోంది. ప్రస్తుతం కూలీలందరికీ బ్యాంకు ఖాతాల ద్వారానే కూలి సొమ్ము అందుతోంది. బ్యాంకర్లు కూడా ఆధార్ ఉంటే తప్ప ఖాతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో జాబ్‌కార్డుకు కూడా ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడం వెనుక ఆంతర్యం ఏమిటి అనేది ప్రశ్న.

త్వరలో ముఖ ఆధారిత హాజరు అమలుకు కూడా కేంద్ర ప్రభుత్వం సిద్ధమౌతోంది. ఈనేపథ్యంలో ఉపాధిలో కోత విధించేందుకే ఇటువంటి విధానాలు అమలు చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికే ఉపాధి పనులను ఒక పూటకు బదులు రెండు పూటలు చేయాలని నిబంధన పెట్టడం, వేసవి అలవెన్సులు, పార, గునపాం, గమేలాలు వంటి పనిముట్లకు చెల్లించే డబ్బులు రద్దుచేయడం వంటి విధానాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఏడాదికి 200రోజులు పని కల్పించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో అసలుకే ఎసరుపెట్టి, ఉపాధి నిధుల్లో మరింత కోత విధించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయా? అన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఇక అసలు విషయానికి వస్తే జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడం విజయనగరం జిల్లాలో 99శాతం పూర్తిచేసినట్టు అధికారులు చెప్తుండగా, పార్వతీపురం మన్యం జిల్లాలో ఆధార్ కార్డు లేని గిరిజనులు చాలా ఎక్కువ మంది ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వీరికి కూలి సొమ్ము ఎలా చెల్లిస్తారో అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి పనులు పెద్దగా జరగడం లేదు. సంక్రాంతి పండగ వెళ్లాక రెండు జిల్లాల్లోనూ పనులు ముమ్మరంగా సాగుతాయి. పేమెంట్లు చెల్లింపుల్లో ఆధార్ లింకు అసలు రంగు బయటపడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

రోడ్డు లేదు... తాగునీరు రాదు

- వైద్యం కోసం డోలిమోతలే శరణ్యం
- నేడు ఐటిడిఎ డిఇ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ధర్నా

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్రం వచ్చి నేటికి 77 ఏళ్లు గడుస్తున్నా నేటికీ గిరిజన జీవితాల్లో సంక్రాంతులు కాన రావడంలేదు. అభివృద్ధికి నోచుకోక నిత్యం సమస్యలతో గిరిజనులు సహజీవనం చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా గిరిజన జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదు. నేటికీ అనేక గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేని దుస్థితి. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్యం నిమిత్తం డోలిమోతలే శరణ్యమయ్యాయి. అలాగే స్వచ్ఛమైన తాగు నీరందని పరిస్థితి. దీంతో చలములు, గెడ్డవాగులు నీటిపైనే ఆధారపడుతూ బతుకు జీవనం సాగిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

గుమ్మలక్ష్మీపురం మండలంలోని వాడ పుట్టి, వనకాబడి, జోగి పురం, శంభు గూడ, వాడ జంగి, ఇజ్జ కాయి, టంకు, గుల్ల లంక, మంత్ర జోల, చిన్న రావి కోన, కొండ బిన్నిడి, బయ్యాడ తదితర మారుమూల కొండ శిఖర గ్రామాల ప్రజలు నేటికీ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నారు. గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో ఈ గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. రహదారి సౌకర్యం లేకపోవడంతో కాలిబాటే శరణ్యమవుతోంది. మరోవైపు పెద్దపెద్ద వాహనాలు గ్రామానికి వెళ్లలేక పోవడంతో తాగునీటి బోర్ల నిర్మాణం జరగలేదు. దీంతో గిరిజనులు చలమలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అనారోగ్యం వాటిల్లితే అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందని పరిస్థితి. దీంతో తరచు మరణాల సంఖ్య కూడా అధికంగా నమోదు కావడం విచారకరం. గర్భిణీలు, వృద్ధులు వైద్యం కోసం రావాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. గిరిజన విద్యార్థులకు విద్య కూడా అందని ద్రాక్షగానే ఉంటుంది. కొండల మీద గ్రామాలకు అధికారులు పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉండడంతో చాలా వరకు విద్యార్థులు డ్రాపౌట్ సంఖ్య కనిపిస్తోంది. పై గ్రామాల నుంచి గిరిజనులు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి వెళ్లిరావాలంటే కనీసం ఒక రోజు పడుతుంది. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాతో నైనా తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుంటారని గిరిజనులు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు.



రోడ్డు సౌకర్యం లేక మంత్రజోల నుంచి రోగిని తీసుకొస్తున్న గిరిజనులు (ఫైల్)

నేడు ఐటిడిఎ డిఇ కార్యాలయం వద్ద ధర్నా

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం గుమ్మలక్ష్మీపురం మండల భద్రగిరి ఐటిడిఎ డిఇ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా జరగనుంది. ఏజెన్సీలోని దేరువాడ నుండి వనకాబడి, దేరువాడ నుండి వండిడి, జర్న నుండి దిగువ చోరుపల్లి, బబ్బిడి నుండి ఎగువ చోరుపల్లి, నోంద్రుకోన నుండి శంభు గూడ, కుశబడి నుండి బబ్బిడి, గండపాక నుండి గుల్లలంక, కిత్త లంబ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ధర్నా చేపట్టనున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ధర్నాకు గిరిజనులంతా అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

వెనుకబాటు జీవితం

కొండ శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో నేటికీ గిరిజనులు వెనుకపడి జీవనం గడుపుతున్నారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు మెరుగుపడలేదు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

- పువ్వల తిరుపతి రావు,
ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి, గుమ్మలక్ష్మీపురం.

గిరిజనుల పట్ల చిన్నచూపు

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గిరిజనుల పట్ల చిన్నచూపు కొనసాగుతూనే ఉంది. గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్న ఆచరణలో ఎక్కడ కాని రావడం లేదు.

- కోలక అవినాష్
ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

నడకతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి - సాలూరు

ప్రతి రోజూ ఉదయం పూట నడకతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చునని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని రామా కాలనీ పార్కు అభివృద్ధికి రూ.50లక్షల నిధులతో పనులనకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన, ఇతర రహదారులపై నడవడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పార్కులో నడక కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ, వార్డు ఇన్‌ఛార్జి పున్నాన మోహన్ రావు, నాయకులు తాడ్డి రమణ, కమిషనర్ టి.జయరాం పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల కోసం

36 గంటల ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిల కోసం ఈనెల 9,10 తేదీల్లో విజయవాడలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో 36 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు తెలిపారు. పిఆర్‌సి ఎరియర్లు, డిఎ ఎరియర్లు, పిఎఫ్ డబ్బు, ఇతర బకాయిలన్నీ కలిపి సుమారు రూ.18,036 కోట్లు ఉన్నాయన్నారు. పిల్లల పెళ్లిళ్లు, ఆరోగ్య అవసరాలు, ఇళ్లు కట్టు కొనేందుకు దాచుకున్న డబ్బులను కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా గతనెల 26, 27 తేదీల్లో డివిజన్ కేంద్రాల్లోనూ, ఈనెల 3న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసినప్పటికీ బకాయిలు చెల్లించనందున ఈ 36 గంట ధర్నాను చేపడుతున్నామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే చలో సెక్రటేరియట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

టిఆర్ఎంఎం పాఠశాలకు డిఇఒ సందర్శన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని టిఆర్ఎంఎం బాలికల పాఠశాలను ఆదివారం జిల్లా విద్యాశాఖాధికారి నిమ్మక ప్రేమ్‌కుమార్ సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు 50 రోజుల ప్రణాళికలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల పరీక్షల కోసం ప్రణాళికా బద్ధంగా చదువుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, పరీక్షల ముందు సమయాన్ని వృథా కాకుండా సద్వినియోగం చేసుకొని మంచి మార్కులు సాధించాలని అన్నారు. 50 రోజులు ప్రణాళికలో భాగంగా ఆదివారం తెలుగు గ్రాండ్ టెస్ట్‌ను వంద మార్కులకు నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు.

కొనసాగిన సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 19వ రోజు ఆదివారం విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో పెద్దఎత్తున ఉద్యోగులు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీడీ కార్యాలయం ముందు శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన తమ నాయకులను అరెస్టు చేయడం దారుణమని, అలాగే జిల్లాకు చెందిన 65మంది సిఆర్టీలను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడాన్ని, ఎమ్మార్సీలకు షోకాజు నోటీసులు ఇవ్వడాన్ని తాము ఖండిస్తున్నామని అన్నారు. అలాగే అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ పట్టీపట్టనట్టు వ్యవహరించడం సహేతుకంగాలేదన్నారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్ట్ ఉద్యోగులు విద్యాశాఖలో విలీనం చేయాలన్న తమ డిమాండ్లను పరిశీలించి, హెచ్ఆర్ పాలసీ అమలయ్యే వరకూ సమ్మెను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎం.ఈశ్వరరావు, కాంతారావు, భాను ప్రకాష్, బివి రమణ, భారతి తదితరులతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

జిఒ ప్రతులు దగ్ధం
27వ రోజుకు అంగన్‌వాడీల నిరవధిక సమ్మె



గుమ్మలక్ష్మీపురంలో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - బలిజిపేట

అంగన్వాడీలు తమ హక్కుల పరిరక్షణకు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే సమస్యలు పరిష్కరించడం మానేసి ఎస్మా ప్రయోగించడం దారుణమైన చర్యని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, అంగన్‌వాడీవర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.దాలమ్మ విమర్శించారు. అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చట్టబద్ధంగా 27రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యలను పరిష్కరించకుండా జిఒ 2 తీసుకొచ్చి, అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం, చట్ట వ్యతిరేకమని, అది అంగన్వాడీలకు వర్తించదని అన్నారు. ఆదివారం బలిజిపేటలో ప్రధాన కూడలిలో కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో వారు మాట్లాడారు. అంగన్వాడీలు, ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వారు గౌరవ వేతనంతో పని చేస్తున్నారని, ఇది ప్రభుత్వ ఉద్యోగులైన, అత్యవసర సర్వీసులైన, డాక్టర్లు హాస్పిటల్, విద్యుత్తు, పాలు ట్రాన్స్‌పోర్ట్, మంచినీరుకి మాత్రమే వర్తిస్తాయన్నారు. కనీస అవగాహన మంత్రులకు, అధికారులకు అవగాహన లేకపోవడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం, అమలు చేయాలని డిమాండ్ చేశారు. బెదిరింపుల ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా అంగన్‌వాడీలపై దుర్మార్గంగా ఎస్మా ప్రకటించడం అన్యాయన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వం అణాలనుకుంటే అంతకు పదిరెట్లు ఉద్యమిస్తారని హెచ్చరించారు. అనంతరం 2 జీవో కాపీలని దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆరు నెలలు, సమ్మె నిషేధమని, ప్రకటించారని, ఇదేమి న్యాయమని, ప్రశ్నిం చారు. మొండిగా వ్యవహరించకుండా రాష్ట్ర నాయకులను చర్చలకు ఆహ్వానించి, సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన తలపెట్టిన సమ్మె ఆదివారం 27వ రోజు నిరాహార దీక్షలు కొనసాగాయి. సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, నాయకులు బి.లక్ష్మి, రామలక్ష్మి, గెద్ద తులసి నిరవధిక నిరాహార దీక్షకు మద్దతు ఇస్తూ ప్రభుత్వం ఎన్ని ఎస్మాలు ప్రయోగించినా అంగన్వాడీల జీతాలు పెంచే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఆదివారం జరిగిన దీక్షల్లో భద్రగిరి, బలిజిపేట మండలాల సెక్టార్ల అంగన్వాడీలు పాల్గొన్నారు.

పాలకొండ : అంగన్వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ కాపీలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమాప్రభ, బి.అమరవేణి, ప్రాజెక్ట్ ప్రతినిధులు ఎస్.గంగమ్మ, జి.శారద, లలిత, దివ్య, ఆదిమ్మ, భవాని, శ్రీదేవి, నిర్మల, తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ నిర్బంధాన్ని మానుకొని వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కురుపాం : ఎస్మా పత్రాలను అంగన్‌వాడీలు దహనం చేశారు. స్థానిక పెట్రోల్ బంకు జంక్షన్ వద్ద అంగన్‌వాడీలు తలపెట్టిన సమ్మె శిబిరం వద్దకు సిఐటియు నాయకులు పువ్వల తిరుపతిరావు వెళ్లి వారికి దీక్ష మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి ప్రాజెక్ట్ కార్యదర్శి జె.సరోజ, కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు చేపట్టిన సమ్మె 27రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బి.రాధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టంతో బెదిరింపులకు దిగుతోందన్నారు. తమ డిమాండ్లను ఆమోదించే వరకు సమ్మె విరమించేది లేదని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.

మక్కువ: స్థానిక బజార్ సెంటర్లోలో ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేస్తూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శ గంట జ్యోతిలక్ష్మి, ప్రాజెక్ట్ నాయకులు దాలమ్మ మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 27 రోజులుగా సమ్మె చేస్తుంటే, సమస్యల పరిష్కారం చేయకుండా, 2 జీవో తీసుకొచ్చి అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం చట్ట వ్యతిరేకమని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా, రాష్ట్ర నాయకులను, చర్చలకు ఆహ్వానించి, సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సావిత్రి, గౌరమ్మ, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్‌వాడీల తలపెట్టిన నిరవధిక సమ్మె శిబిరం వద్ద ఎస్మా చట్టం జీవో 2 కాపీని దగ్ధం చేశారు. అనంతరం, సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 27రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె తీవ్రతను ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రయోగించి ఎస్మా చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని, లేకుంటే ప్రజా మద్దతు కూడగట్టి పోరాటన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరించి ఎస్మా ప్రయోగించడం పట్ల అంగన్వాడీలు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆదివారం ఎల్విన్ పేట కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు సత్యవతి మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా జగనన్న మాట తప్పారంటూ పేర్కొన్నారు. అనంతరం ఎస్మా జిఒ కాపీను దగ్ధం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి వై.కస్తూరి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కోలక అవినాష్, చెముడు గూడ ఎంపిటిసి మండంగి రమణ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.**గరుగుబిల్లి:** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీవో నెంబర్ 2 కాపీలను రహదారిపై దగ్ధం చేశారు. కార్యక్రమంలో యూనియన్ కాత్యాయిని, లక్ష్మి, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీతానగరం : అంగన్వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టం జీవో కాపీలను అంగన్వాడీ కార్యకర్తలు దగ్ధం చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్వాడీల సమ్మె ఆదివారానికి 27రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేసి, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, మండల నాయకులు మడక సత్యవతి, సునీత, సిఐటియు మండల కార్యదర్శి జి వెంకటరమణ, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మక్కువలో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు



పార్వతీపురంలో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న సిఐటియు నాయకులు



బలిజిపేటలో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు

ఉద్యోగులపై నిర్బంధాలను వీడాలి : సిఐటియు

జిఒ ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం వీడాలని, ప్రజాస్వామ్య దేశంలో నిర్బంధానికి తావులేదని సిఐటియు నాయకులు జివి రమణ, బివి రమణ అన్నారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆదివారం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జీవో నెంబర్ 2 కాపీలను దగ్ధం చేస్తూ ప్రభుత్వ తీరు పట్ల నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ విడుదల చేసిన జీవో నెంబర్ 2ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం ప్రసాదించిన గాంధీ మహాత్ముని ఆశయాలకు విరుద్ధంగా రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, తమ సమస్యలపై శాంతియుతంగా పోరాడుతున్న కార్మికులు, ఉద్యోగుల పట్ల నిర్బంధాన్ని ప్రయోగించే ధోరణి విడనాడాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తాతబాబు, క్రాంతి, శంకర్రావు, లక్ష్మణ, మౌళి, పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : అంగన్వాడీలపై ప్రభుత్వ దుర్మార్గం ఆపాలని, జీవో 2ను రద్దు చేయాలని, అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టివలసలో జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించకుండా దుర్మార్గంగా వ్మవహరించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఇచ్చిన జీవో ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంతల చిన్న, శివ, రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

పాచిపెంట : రాష్ట్ర ప్రభుత్వం జీవో 2ను తక్షణమే రద్దుచేసి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని మెట్టవలస వద్ద జీవో ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు సుకూరు అప్పలస్వామి, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


జగన్మోహనరావుకు పుష్పగుచ్ఛమిచ్చి అభినందిస్తున్న సిబ్బంది

జిల్లా మలేరియా అధికారిగా జగన్మోహనరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా మలేరియా అధికారి (ఇంచార్జి)గా డాక్టర్ టి.జగన్మోహనరావు నియమించారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతవరకు డాక్టర్ జగన్మోహనరావు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ)గా సేవలు అందించి ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారు. జిల్లా మలేరియా అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. మలేరియా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో మలేరియా నివారణకు కృషి చేస్తానని అందుకు సిబ్బంది తనకు తోడ్పాటునందించాలని కోరారు. ఎఎంఒ సూర్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వార్డు సభ్యుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ జెకె పాడుకు చెందిన 13వ వార్డు సభ్యులు అడ్డాకుల నవీన్‌కుమార్ మూడు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. వార్డు మెంబర్ మృతి చెందడంతో ఆయన భార్యకు వైఎస్ఆర్ బీమా లక్ష రూపాయల చెక్కును సర్పంచ్ ఆర్.చైతన్య ప్రమీల అందించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కుమార్, డిడిఒ నాగరాజు, కన్వీనర్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.


ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజనులు

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మ వలస మండలంలో గల రోడ్డు లేని గిరిజన గ్రామాల ప్రజలు ఈనెల 9న స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద చేపట్టబోయే ధర్నాకు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గసభ్యులు కొల్లి గంగునాయుడు కోరారు. ఆదివారం డ్రాక్షా గిరిజన గ్రామంలో గిరిజనులతో కలిసి ధర్నా గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో ఏళ్ళు గడుస్తున్నప్పటికీ కనీసం గిరిజన గ్రామాలకు సరైన రహదారి కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎందరు అధికారులు వచ్చినా గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున రోడ్డు లేని గ్రామాలకు తక్షణమే రోడ్లు వేయాలని సిపిఎం ఆధ్వర్యాన ఈనెల 9న ధర్నా చేపడుతున్నామని, ఇందులో పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.మోహన్ రావు, గిరిజనులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి -సీతానగరం

ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు పిఎఫ్, ఎపి జిఎల్ఐ, పిఆర్‌సి, డిఎ అరియర్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 9,10 తేదీల్లో విజయవాడలో తలపెట్టిన 36 గంటల మహా ధర్నాను యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు ఒకప్రకటనలో కోరారు. ఈ మహాధర్నాకు మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.


చురుగ్గా చేపడుతున్న ప్రధానరహదారి మరమ్మతు పనులు

ఎట్టకేలకు ప్రధాన రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువలో ప్రధాన రహదారికి ఎట్టకేలకు ఆదివారం నుంచి మరమ్మతు పనులు చేపట్టారు. ఏడాదికాలంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పరమ అధ్వాన్నంగా తయారైంది. దీనిపై పలుమార్లు 'ప్రజాశక్తి' కథనాలను కూడా ప్రచురించింది. ఎట్టకేలకు సంక్రాంతి, శంబర పోలమాంబ జాతర సమీపిస్తుండడంతో ఈ రహదారికి మోక్షం కలిగించడంతో ఈ ప్రాంత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చట్టం కొరుతూ లారీ కార్మికుల రాస్తారోకో

ప్రజాశక్తి - సాలూరు

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక లారీ కార్మికులు ఎఐటియుసి ఆధ్వర్యాన జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆదివారం ఎఐటియుసి జిల్లా నాయకులు సిద్ధాబత్తుల రామచంద్రరావు ఆధ్వర్యాన కార్మికులు ఆందోళన చేపట్టారు. ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన ఈ చట్టంలో లారీ కార్మికులు, యజమానులకు తీవ్ర నష్టమని, దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రద్దు చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.


మానాపురంలో ప్రచారం చేస్తున్న జయకృష్ణ

మానాపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మానాపురం పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. యువత మద్దతు టిడిపికేనని, అన్ని వర్గాల వారిని మోసగించిన వైసిపి ప్రభుత్వం ఈ సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నవరతోట మోఖలింగం, మండల ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, యూనిట్ ఇన్‌ఛార్జ్ మండంగి ప్రకాశం, బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగారావు, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఐటిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇమరక పవన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంట సుధా, మూటక భరత్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట చెక్ పోస్ట్ వద్ద ఆదివారం పోలీ సులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆంధ్రా నుంచి ఒడిశా, శ్రీకాకుళం, పార్వతీపురం ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆటోలు, వ్యాన్లు, లారీలను నిలిపివేసి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన పత్రాలు, లైసెన్సులతో పాటు వాహన దారుడు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

13వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, వాటర్ సెక్షన్ కార్మికులు అన్నారు. 13వ రోజు సమ్మెలో భాగంగా, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో కార్మికులు ఆదివారం స్థానిక పాతబస్టాండ్ కూడలి వద్ద మానవహారం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఆప్కాస్ విధాన ద్వారా కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, ఇంజనీరింగ్ వర్కర్లందరికీ హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేషు, గుంట్రెడ్డి గంగయ్యలు, తాడ్డి వినయ్, వంగపండు అప్పలనాయుడు, మేడిశెట్టి కృష్ణ, అరసాడ తాతబాబు, నాగవంశం మల్లేసు, బంగారు రవి, నిర్మల ఇప్పలమ్మ, పాపులమ్మ, పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు, తదితర కార్మికులు పాల్గొన్నారు.


పాలకొండలో నిరసన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు


సాలూరులో రాస్తారోకో చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సర్వమత ప్రార్థనలతో కార్మికుల నిరసన

సాలూరు: మున్సిపల్ కార్మికుల సమ్మె 13రోజుకు ఆదివారం చేరింది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు ఆదివారం మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. హిందూ, క్రైస్తవ, ముస్లిం దేవుళ్ల ఫొటోలకు పూజలు చేస్తూ కార్మికులు నిరసన తెలిపారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి మనసు మార్చాలని కోరుతూ కార్మికులు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ కార్మికుల సమ్మె పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని అన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సమస్యలు ఆమోదించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోలరాజు, టి.రవి, శ్రామిక మహిళా కన్వీనర్ టి.ఇందు పాల్గొన్నారు.

పాలకొండ : పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా ఆదివారం చెక్ పోస్ట్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పడాల భాస్కరరావు, పడాల వేణు, చింతల కైసు, సంజీవి, విమల తదితరులు ఉన్నారు.

సవరభాష ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - సీతంపేట

పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల సవర భాషా ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా బిడ్డిక వెంకటేష్, సవర ఆనందరావు, కార్యదర్శిగా బిడ్డిక భీమారావు ఎన్నికయ్యారు. ఆదివాసీ మాతృ బహుభాషా ఉపాధ్యాయ రాష్ట్ర కమిటీ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయని రాష్ట్ర కార్యదర్శి సవర డొంబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, జిల్లా అధ్యక్షులు తోట రమేష్, గిరిజనసంఘం నాయకులు లక్ష్మణజావు, మండంగి రమణ పాల్గొన్నారు.

ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తీరు సరికాదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పోరాడుతున్న మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలు, సర్వశిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీరు సరిగా లేదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం రంజిత్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీలపై "ఎస్మా"ప్రయోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్మా ప్రయోగిస్తూ ఇచ్చిన జిఒ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వ శిక్ష ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలు, సర్వ శిక్షా ఉద్యోగులకు జీతాలు పెంచి, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్కుకు పర్యాటక శోభ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక అడ్వెంచర్ పార్క్‌పర్యాటకులతో ఆదివారం కిక్కిరిసింది. చిన్నారులు చిల్డ్రన్ పార్క్ వద్ద ఆడుకుంటూ మినీ ట్రైన్ ఎక్కి సరదాగా గడిపారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ, యువకులు నడిచి వెళ్లారు. ఆనంద విహార్ వద్ద పర్యాటకులు ఉల్లాసంగా, ఉత్సాహంగా డ్యాన్సులు వేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

'రా.. కదలిరా'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 10న బొబ్బిలిలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరగబోయే రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి కోరారు. వైసిపి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బిసిలు దగాపడ్డారని అన్నారు. రాక్షస పాలనకు చమరగీతం పాడాలని లక్ష్యంతోనే ఈనెల 10న బొబ్బిలిలో రా కదలిరా కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు. కావున కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలి రావాలని ఆమె కోరారు.

పార్వతీపురంరూరల్ : ఈనెల 10న బొబ్బిలి పట్టణంలో జరిగే రా కదలిరా కార్యక్రమంలో భాగంగా టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నిర్వహించబోయే బహిరంగ సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండలాల నుంచి అభిమానులను, కార్యకర్తలను పెద్ద ఎత్తున తరలించడానికి స్థానిక కార్యకర్తలు ఏర్పాట్లు చేయాలని కోరారు. .

గరుగుబిల్లి : ఈనెల 10న బొబ్బిలిలో జరుగు తెలుగుదేశం.... పిలుస్తోంది..... రా... కదలిరా సభను విజయవంతానికి సోమవారం టిడిపి అత్యవసర సర్వసభ్య సమావేశం ఎర్రన్న గుడి జంక్షన్‌లో జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ ఎ.మధుసూదనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభకు వివిధ హోదాల్లో ఉన్న నాయకులంతా పాల్గొనాలని కోరారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కొమరాడ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తుందని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రమైన కొమరాడ సచివాలయంలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛను రూ.2750 నుండి రూ.3 వేలుకు పెంపు జరిగిందని, ఇది అవ్వాతాతలకు అండగా ఉంటుందన్నారు. ఆర్థికంగా మహిళలకు చేయూత ఇవ్వడానికి అనేక పథకాలు అందిస్తున్నారని చెప్పారు. పింఛనును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక అభ్యున్నతి దిశగా అడుగులు వేయాలన్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమంలో పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు వైఎస్ఆర్ ఫంక్షన్ కానుక కింద రూ.3వేల పెన్షన్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి శ్యామల, జడ్పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపిపిలు కె.అన్నపూర్ణ, శరత్ బాబు, మండల వైసిపి కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన, శెట్టి మధుసూదనరావు, కొమరాడ సర్పంచ్ సిరికి గంగమ్మ, తొడుము సర్పంచ్ నాగిరెడ్డి సింహాచలం, ఎంపిటిసి సభ్యులు ఎం.అశ్విని, ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, ఎంఇఒ జె.నారాయణస్వామి, ఎపిఒ బాలకృష్ణ, ఎనర్జీ ఎస్‌జె సోమేశ్ పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సాలూరు: పట్టణంలోని డబ్బివీధి కళ్యాణమండపంలో మండలంలోని పేదలకు మూడు వేల రూపాయల చొప్పున ఫించన్ల పంపిణీ కార్యక్రమం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సంఖ్యలో పేదలకు ఫించన్ల పంపిణీ చేపడుతున్నది తమ ప్రభుత్వమేనన్నారు. వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి జి.రాములమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, పెద్దింటి మాధవరావు, సువ్వాడ రామకృష్ణ, ఎంపిడిఒ జి.పార్వతి పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఎంపిటిసి లకు బహుమతులు:

మండలంలోని ఎంపిటిసి సభ్యులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి డిప్యూటీ సీఎం రాజన్నదొర చేతులు మీదుగా బహుమతులు పంపిణీ చేయించారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా ఆమె, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ బహుమతులు అందజేశారు.

ఎజెఎసి మేనిఫెస్టో అమలు చేసే పార్టీకే మద్దతు

గీత కుల వివాదంపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో ఆదివాసీ జెఎసి సూచించిన మేనిఫెస్టో అమలుకు హామీ ఇచ్చిన పార్టీకే మద్దతు తెలపాలని నిర్ణయించినట్లు జిల్లా ఎజెఎసి వైస్ చైర్మన్ కొండగొర్రి ఉదయ్ కుమార్ చెప్పారు. ఆదివారం మక్కువ మండలం వైఎస్‌వలసలో ఎజెఎసి సమావేశం నిర్వహించారు. పనసభద్ర సర్పంచ్ చోడిపిల్లి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ అవసరమైతే రానున్న ఎన్నికల్లో ఎజెఎసి తరపున కొన్ని నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులను బరిలోకి దించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో ఎజెఎసి బలోపేతం చేయడం, రాబోయే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా పని చేయకూడదని తీర్మానించామని తెలిపారు. షెడ్యూల్డ్ ఏరియాకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 244(1) కి అనుగుణంగా షెడ్యూల్ ఏరియాలో పరిపాలన సాగాలన్నారు. పీసా చట్టాన్ని అమలు చేయాలని, అటవీ హక్కుల సంరక్షణ చట్టం 2023 నియంత్రణ, ఎల్టిఆర్ చట్టాలపై అవగాహన వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. మాజీ ఎంపి కొత్తపల్లి గీత ఎస్‌టి కాదంటూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని అన్నారు. సమావేశంలో మక్కువ మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా ఒ.మోహనరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం.పోలిరాజు, సహా కార్యదర్శిగా ఎం.జోగిరాజు, కోశాధికారిగా సిహెచ్.వాసు, సహ కోశాధికారిగా ఆర్.అరవింద్, మహిళా అధ్యక్షురాలిగా కె.ఆదిలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎజెఎసి ముఖ్య సలహాదారు ఆరిక నీలకంఠం, స్థానిక నాయకులు రాయల విజయ్ కుమార్, కె.సోమయ్య, రాయల అనిరుధ్ పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎజెఎసి వైస్‌చైర్మన్ ఉదయ్‌కుమార్


వీరఘట్టం : విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ, యుటిఎఫ్ నాయకులు

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

చదువు పట్ల విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు విద్యార్థులకు సూచించారు. ఆదివారం స్థానిక శ్రీ గాయత్రి పాఠశాల, కళాశాలలో యుటిఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నవోదయ మోడల్ టెస్టు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పోటీతత్వం ఉండడం వల్ల విద్యార్థుల్లో వెనుకబాటు తనం ఉండదని, తద్వారా ఎలాంటి పరీక్షలు అతి సునాయాసంగా రాయగలరని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు మీడియంలో 177 మంది, ఇంగ్లీష్ మీడియంలో 77 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లాస్థాయిలో జియ్యమ్మవలసకు చెందిన ఎల్.పార్థవ్ ప్రథమ, వీరఘట్టానికి చెందిన వి.జీవన్ ద్వితీయ, జియ్యమ్మవలసకు చెందిన ఎల్.గౌతం ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో బొడ్లపాడు చెందిన రోహన్, ద్వితీయ స్థానంలో హుస్సేన్‌పురానికి చెందిన కె.సాయిచరణ్, తృతీయ స్థానంలో కిమ్మి గ్రామానికి చెందిన జి.మోహన్‌నాయుడు ఎంపికయ్యారు. ఆయన చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, గౌరవాధ్యక్షులు ఎ.స్వామిబాబు, కళాశాల కరస్పాండెంట్ ఎస్.లోకేష్, కార్యవర్గ సభ్యులు జెవి సూర్యప్రకాష్, వాసుదేవరావు, సతీష్, అన్నాజీరావు, ముకుందరావు, చంద్రమోహన్, బాలమురళి, కె.గోవిందరావు, ఎస్.రాంబాబు, ఎ.రాంబాబు, చంద్రమౌళి, విజయభాస్కర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో మొదటి 30 స్థానాలు పొందిన వారికి తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఈనెల 12న ఉదయం 9 గంటలకు మోడల్ గ్రాండ్ టెస్ట్ ఉంటుందని యుటిఎఫ్ మండల శాఖ తెలిపింది.

హై స్కూల్ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన

గుమ్మలక్ష్మీపురం :జియమ్మవలస మండలం పెదమేరంగి జంక్షన్‌లో గల తిరుమల సాయి హైస్కూల్ వారు గత 23 ఏళ్లుగా జవహర్ నవోదయ మోడల్ టెస్టును నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన మోడల్ పరీక్షకు ఉమ్మడి జిల్లాల నుంచి 16 మండలాల్లో గల 334 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై ప్రవేశ పరీక్ష మెలకువలను నేర్చుకొని జనవరి 20న నిర్వహించబోయే జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు ఆత్మవిశ్వాసంతో సంసిద్ధులయ్యారు. ఆదివారం నిర్వహించిన పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంఇఒ శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతి గొల్ల మోహన్ స్వరూప్ (తిరుమల సాయి హై స్కూల్ విద్యార్థి 93మార్కులు), రెండవ బహుమతి గెంబల లాస్య అందుకుంది. మొత్తం 19 మంది విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో చినమేరంగి ఎస్ఐ కళాధర్, అకాడమిక్ డైరెక్టర్ ఆర్ వెంకటరమణ, హెచ్‌ఎం జి. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పనుల పరిశీలన

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

పట్టణ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకు మండలంలోని వెంకంపేట గ్రామ రెవెన్యూ పరిధిలో కేటాయించిన జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహనిర్మాణాలు త్వరితగతిని పూర్తి చేసుకోవాలని, కాలనీలో అవసరమైన విద్యుత్, నీటి సదుపాయం కల్పిస్తామని అన్నారు. త్వరలో అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.


కాలనీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఏడాది నుంచి నీరు రావడం లేదు

ప్రజాశక్తి -వీరఘట్టం

తెట్టంగి(?) గ్రామానికి వండవ ఉపరితల రక్షిత మంచినీటి పథకం నుంచి కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదని మండలంలోని పివిఆర్ పురానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఒకే ఒక కుళాయి పాయింటు పాఠశాల వద్ద ఏర్పాటు చేశారని, అందరికీ మోటార్లు ఉండవు కదా? కొంతమంది మాత్రం వీటిపైనే ఆధారపడి కాలం వెల్లదీస్తున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొంతమంది అయితే సమీపంలో ఉన్న నాగావళి నది వద్దకు వెళ్లి చలమలదార నీరు తోడుకుని తీసుకువచ్చి దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని పివి ఆర్ పురం గ్రామస్తులు కోరుతున్నారు.


పివిఆర్‌పురంలో నిరుపయోగంగా ఉన్న కుళాయి

'టిడిపిని వీడలేదు'

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని దురిబిలి నుంచి 40 కుటుంబాలు వైసిపిలో చేరాయంటూ వచ్చిన వార్తలు అవాస్తవమని టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం టిడిపి మండల నాయకులతో కలిసి ఆ గ్రామానికి వెళ్లామన్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి వద్దకు రోడ్డు, జగనన్న ఇళ్ల కోసం వెళ్తే వారు వైసిపి కండువా వేసి పార్టీలో చేరామనే తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. టిడిపి అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్నా టిడిపి వైపే ఉంటాము తప్ప వేరే పార్టీలోకి మారే ప్రజలం తాము కాదని, ఎట్టి పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీని వీడే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్రపండా, మండల మాజీ కన్వీనర్ చిలకలపల్లి వెంకటరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బోటు గౌరి, పత్తిక మాశయ, ఆకుల రమేష్, గ్రామ పెద్దలు పువ్వుల పత్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి..13 మంది అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని వాకాడవలస శివారులో అమ్మవారి ఆలయం వద్ద కోడి పందాలపై పోలీసులు ఆదివారం దాడి చేసి 13మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 31,260 నగదు, 15కోడి పుంజలను స్వాధీనం చేసుకున్నారు. కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం పట్టుకున్నట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ చెప్పారు.

భోగాపురం: మండలంలోని లింగాల వలస గ్రామ శివారులో కోడిపందాల శిబిరంపై పోలీసులు అదివారం దాడి చేశారు. కోడిపందాలు జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ కృష్ణమూర్తి సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. ఏడుగురు వ్యక్తులతో పాటు రెండు కోళ్లు, 15వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేగిడి: మండలంలోని ఉణుకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెల్ట్‌షాపు నడపడంతో 35 మద్యం బాటిళ్లతో పోలీసులకు ఆదివారం పట్టుబడ్డాడు. ఉంగరాడ మెట్ట నుంచి ఉణుకూరు స్వగ్రామానికి అక్రమంగా 35 మద్యం బాటిళ్లు తీసుకువెళ్ళడంతో పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని రేగిడి పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయనతో పాటు పోలీసులు శివ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కొండగంగుపూడిలో అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్నట్లు గ్రామస్తుల ఇచ్చిన సమాచారం మేరకు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తన సిబ్బంది కలిసి ఆదివారం దాడులు చేశారు. ఈ దాడిలో 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు.